సాక్షి చిత్తూరు

శుక్రవారం ǀ 6 ǀ అక్టోబర్ ǀ 2023



స్వయం సహాయక సంఘాలు భేష్

స్వయం సహాయక సంఘాల నిర్వహణలో జిల్లా ప్రగతిబాటలో ఉందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

- 8లో



కాణిపాకం పుష్ప శోభితం

కాణిపాకం వినాయకస్వామి ఆలయాన్ని గురువారం విదేశీ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	24
తిరుపతి	34	24
తిరుమల	31	21
గూడూరు	37	26
నగరి	36	25

న్యూస్‌రీల్

నవోదయ ఖాళీ సీట్లకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : అన్నమయ్య జిల్లా వలసపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయాలో ఖాళీ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశ పరీక్ష ద్వారా 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. తొమ్మిదవ తరగతికి ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదివి ఉండాలన్నారు. 01-05-2009 నుంచి 31-07- 2011 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. 11వ తరగతికి పదవ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. 01-06-2007 నుంచి 31-07-2009 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2024 ఫిబ్రవరి 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని డీఈవో వెల్లడించారు.

ముగిసిన హెచ్‌ఐ పోస్టుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న హెచ్‌ఎంలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని బాలాజీ కాలనీ మున్సిపల్ స్కూల్‌లో రెండు రోజుల ఐఈఆర్‌పీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారంతో ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఐఈఆర్‌పీ (హెచ్‌ఐ, వీఐ) కేటగిరీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్‌లను సీనియర్ హెచ్‌ఎంల ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి క్షుణ్ణంగా పరిశీలించారు. బుధవారం జరిగిన పరిశీలనకు 90 మందికి గానూ 82 మంది, గురువారం పరిశీలనకు 76 మందికి గానూ 66 మంది హాజరైనట్లు సమగ్ర శిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి వెల్లడించారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త ప్రభాకర్‌వర్మ, సిబ్బంది లావణ్య, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు



మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని 84 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు వినియోగదారులకు త్వరలో అందుబాటులోకి రానున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ యాక్ట్‌పై సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులకు పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడో దశ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్ సేవల అమలుపై ప్రభుత్వం ఈనెలలో నోటిఫై చేయనుందన్నారు. ఎల్‌పీఎం సంఖ్య ఆధారంగా స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. సీసీ, ఈసీలను అధ్యయనం చేయాలన్నారు. మార్కెట్ విలువ ఆధారంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు సంబంధిత అకౌంట్‌లో జమ అయ్యిందా అనే విషయం చెక్ చేసుకోవాలని తెలిపారు. ఈకేవైసీ, వేలిముద్రల, ఫోటోల సేకరణ, ఈస్టాంపింగ్ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల కట్టడికి చర్యలు



మాట్లాడుతున్న మలేరియా నివారణాధికారి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: వర్షాల కారణంగా వాతావరణం మారిన నేపథ్యంలో జిల్లాలో జ్వరాల కేసులు నమోదవుతున్నాయని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన గురువారం మలేరియా సబ్ యూనిట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో జ్వరాలు ప్రబలకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, దోమల నివారణకు కట్టడి చర్యలు చేపట్టాలని సూచించారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.



నగరోత్సవానికి పోటెత్తిన భక్తులు(ఇన్‌సెట్) ఊరేగుతున్న పోలేరమ్మ తల్లి

జై పోలేరమ్మా.. జైజై పోలేరమ్మా!

వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ తల్లి జాతర చివరి ఘట్టం గురువారం అట్టహాసంగా ముగిసింది. సాయంత్రం జరిగిన అమ్మవారి నగరోత్సవం జనసముద్రాన్ని తలపించింది. 'జై పోలేరమ్మా.. జైజై పోలేరమ్మా..' అంటూ భక్తుల నామస్మరణ వెంకటగిరి పురవీధుల్లో మార్మోగింది. గతానికి భిన్నంగా ఈ సారి రాష్ట్ర పండుగ హోదాలో సంప్రదాయానికి పెద్దపీట వేశారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో వెంకటగిరి రాజాల సూచనలు, సలహాలతో జాతరను విజయవంతంగా పూర్తిచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు.

- ముగిసిన వెంకటగిరి జాతర
- తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు
- కట్టుదిట్టమైన భద్రత కల్పించిన పోలీసులు
- సంప్రదాయ బద్ధంగా అమ్మవారి నిమజ్జనం

సైదాపురం(వెంకటగిరి): వెంకటగిరి పోలేరమ్మ జాతర భక్తజనసందోహం నడుమ అట్టహాసంగా ముగిసింది. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోలేరమ్మా.. దండాలు మాయమ్మా.. చల్లాగా చూడమ్మా.. అంటూ భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. భక్తుల ఈలలు, కేరింతల నడుమ సాయంత్రం నగరోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అంతకుముందు వేకువజామున అమ్మవారిని జీనిగల వారివీధి నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి పోలేరమ్మ గుడి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిరిలో నిలుపుదల చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వెంకటగిరి రాజా కుటుంబీకుల తరఫున ప్రతినిధులు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారెను సమర్పించారు. సాయంత్రం 3 గంటల సమయంలో దున్నపోతును బలి ఇచ్చారు. అనంతరం గ్రామ పొలిమేరల్లో పొలి చుట్టారు. ఆ తర్వాత ప్రత్యేకంగా అలంకరించిన రథంపై పోలేరమ్మ తల్లిని అధిష్ఠింపజేసి నగరోత్సవాన్ని నిర్వహించారు. బజారువీధి, రాజావీధి, శివాలయంవీధి మీదుగా నగరోత్సవం సాగింది. కాశీ విశ్వనాథస్వామి దేవస్థానం వద్ద అమ్మవారిని ట్రాక్టర్‌లో ఉంచి కైవల్యానది మీదుగా మల్లమ్మగుడి సమీపంలో నిమజ్జనోత్సవం నిర్వహించారు.



మంత్రి కాకాణికి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



అమ్మవారికి బంగారు ఆభరణాన్ని బహూకరిస్తున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

పోలేరమ్మ సేవలో మంత్రి కాకాణి

పోలేరమ్మ తల్లిని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అమ్మ వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

కానుకల వెల్లువ

పోలేరమ్మ తల్లికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బంగారు ఆభరణాన్ని బహూకరించగా.. రాజావారి కుటుంబ సభ్యులైన సాయికృష్ణయాచేంద్ర, సర్వజ్ఞకుమారకృష్ణయాచేంద్ర అమ్మవారికి కానుకలు సమర్పించారు.

వెంకటగిరి రాజాల ప్రత్యేక పూజలు



నగరోత్సవం స్థానిక రాజా ప్యాలెస్ వద్దకు రాగానే వెంకటగిరి రాజా కుటుంబీకులు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ.సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరోత్సవం జరుగుతుండగా అటువైపు వచ్చిన 108 వాహనానికి దారి ఇచ్చి స్థానికులు, భక్తులు సహకరించడం పలువురిని ఆకట్టుకుంది.

మట్టి కోసం ఎగబడిన జనం



సంప్రదాయ బద్ధంగా అమ్మవారికి దేవదాయశాఖ అధికారులు బంగారు నగలు తొలగించి విరూప మండపంలో కొలువుంచారు. నిమజ్జనం అనంతరం అమ్మవారి మట్టిని తీసుకునేందుకు జనం ఎగబడ్డారు.



అమ్మవారికి సారె తీసుకొస్తున్న వెంకటగిరి రాజాలు



108..రైట్‌రైట్



భారీ క్యూ



వేట కత్తిని తీసుకెళ్తూ..



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కల్పవృక్షం.. పులకించిన భక్తజనం

కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీసిద్ధి, బుద్ధి సమేతంగా గణనాథుడు కల్పవృక్ష వాహనంలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ వాహనసేవ నయనానందకరంగా సాగింది. విదేశీ పుష్ప తోరణాలతో ఆలయం గుబాళించింది. మధ్యాహ్నం శతకలశ క్షీరాభిషేకం వేడుకగా జరిగింది.



క్షీరాభిషేకం పూజల్లో పాల్గొన్న ఈఓ, ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం వేకువజామున ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శనానికి తరలి వచ్చారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు చేసి పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో అలంకరించి కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు ప్రారంభమైంది. భక్తులు కనులారా తిలకించి పులకించారు. అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.



ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం

వేడుకగా శత క్షీర కలశాల ఊరేగింపు

మధ్యాహ్నం శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవరులకు శత కలశ క్షీరాభిషేకం వేడుకగా జరిగింది. తొలుత ఉభయదారులు శత క్షీర కలశాలను మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకు వచ్చారు. అలంకార మండపంలో ప్రధాన అర్చకులు శేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, గంధం, తేనె, పన్నీరు, పవిత్ర జలాలతో వేదోక్తంగా అభిషేకాలు చేశారు. తదుపరి సర్వాంగ సుందరంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు.



కల్పవృక్ష వాహనంలో సిద్ధి,బుద్ధి సమేతంగా వినాయకస్వామి

జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గం

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీఆర్‌డీఏ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన జిల్లా సమాఖ్య మహాజన సభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సుకన్య (ఐరాల),ఉపాధ్యక్షురాలిగా అన్నపూర్ణ (గుడుపల్లె), కార్యదర్శిగా అనిత (గంగవరం), సంయుక్త కార్యదర్శిగా కృష్ణవేణి (పలమనేరు), కోశాధికారిగా హేమలత (పెద్దపంజాణి) ఎన్నికయ్యారు.

జిల్లాకు 200 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ సర్వీసులకు వినియోగించే 25 కేవీ సామర్థ్యం ట్రాన్స్‌ఫార్మర్లు 200 వచ్చినట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సంబంధిత ఏఈలు వర్క్‌ఆర్డర్లు పెట్టి మెటీరియల్ డ్రా చేసుకోవాలని పేర్కొన్నారు.

యువకుడు ఆత్మహత్య

● అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబీకులు



మృతి చెందిన ఓంకార్(ఫైల్)

చిత్తూరు అర్బన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లె గ్రామానికి ఓంకార్ (29) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. డిగ్రీ పూర్తిచేసి హైదరాబాద్‌లోని ఓ మార్టులో ఇతను పనిచేసేవాడు. గతనెల 29న మనస్తాపంతో ఆత్మహత్యా యత్నం చేశాడు. అదే రోజు రాత్రి తల్లిదండ్రులు సంతోష్‌కుమార్, సుజాత చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. గురువారం మృతి చెందాడు. బంగారుపాళ్యం సీఐ నాగరాజు రావు అవగాహన కల్పించడంతో యువకుని అవయవాలు దానం చేసేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. అంగీకార పత్రం అందజేశారు.

కాణిపాకం పుష్పశోభితం



ద్రాక్ష వినాయకుని ప్రతిమ



ఆలయంలో విశేష పుష్పాలంకరణ



పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న మహానంది దేవస్థానం చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వినాయక స్వామి ఆలయం గురువారం పుష్ప శోభితమైంది. కల్పవృక్ష సేవ ఉభయదారులుగా వ్యవహరించిన దేవస్థానం పాలకమండలి సభ్యులు, అధికారులు విదేశీ పుష్పాలను తెప్పించి ఆలయం, పరిసరాలను శోభాయమానంగా అలంకరించారు.

మహానంది దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు

ప్రత్యేక ఉత్సవాల సందర్భంగా గురువారం మహానంది దేవస్థానం తరపున పట్టు వస్త్రాలను ఆలయ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి సమర్పించారు. రాత్రి వారు పట్టు వస్త్రాలను తీసుకురాగా కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికారు. అనంతరం అతిథి గృహం నుంచి పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకురాగా, స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు, దర్శనానంతరం వారికి వేదపండితులు ఆశీర్వచనం చేసి, స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందించారు.

3.5 టన్నుల కూరగాయల వితరణ

దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి 3.5 టన్నుల కూరగాయలను తిరుపతి ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ కమిటీ సభ్యుడు కుమారస్వామిరెడ్డి వితరణగా అందించారు. గురువారం ఉదయం ఆయన ప్రత్యేక వాహనంలో పలు రకాల కూరగాయలను తీసుకు వచ్చి ఆలయ అధికారులకు అందజేశారు. దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి,తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆలయ సిబ్బందికి వితరణ

బ్రహ్మోత్సవాలలో స్వామివారికి సేవలు అందించిన ఆలయ సిబ్బందికి పలు మార్కెట్ కమిటీలకు చెందిన సభ్యులు కూరగాయలు వితరణగా అందించారు. గురువారం సాయంత్రం పలమనేరు, వడ్డెపల్లె, తమిళనాడులోని హొసూరు, కర్ణాటకలోని కేఆర్‌పురం, చింతామణి మార్కెట్ వ్యాపారస్తులు రవీంద్రారెడ్డి, మిత్రబృందం కూరగాయలను ఆలయం వద్దకు తీసుకువచ్చారు. 550 మంది సభ్యులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున అందించారు. దాతలకు ఈఓ వెంకటేశు ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు.



ఆలయ సిబ్బంది, అర్చకులకు కూరగాయలు అందిస్తున్న దాతలు



నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ



ధ్వజస్తంభానికి పుష్పాలంకరణ

స్వయం సహాయక సంఘాలు భేష్

- కార్పొరేట్‌కు దీటుగా ఉత్పత్తులు రావాలి
- మహాజన సభలో కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు అగ్రికల్చర్: స్వయం సహాయక సంఘాల నిర్వహణలో జిల్లా మెరుగైన స్థానంలో ఉందని, ఇదే ప్రగతిబాటను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ తెలిపారు. గురువారం డీఆర్‌డీఏ కార్యాలయ సమావేశ భవనంలో సమాఖ్య అధ్యక్షురాలు మంజుల అధ్యక్షతన జిల్లా సమాఖ్య మహాజన సభను నిర్వహించారు. ముఖ్యతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో కార్పొరేట్‌కు దీటుగా, మారుతున్న మార్కెటింగ్ పరిస్థితులకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయాలన్నారు. ఆహార పదార్థాలు రుచితో పాటు ఆరోగ్యపరంగా ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా తయారు చేయాలని తెలిపారు. తద్వారా మార్కెటింగ్ మరింతగా పెరిగి ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. పదార్థాల తయారీ విధానాలపై మరింత అవగాహన కోసం సహకారం అందిస్తామని పేర్కొన్నారు. చిత్తూరు అమూల్ డెయిరీ ద్వారా పాల వెల్లువ కింద పాలు కొనడం ద్వారా సంఘాల మహిళలకు ఆర్థికంగా మరింతగా లాభపడవచ్చన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడంలో చురుగ్గా వ్యవహరించి జిల్లాలో ఒక పెద్ద పరిశ్రమను నెలకొల్పే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

విజయబాటలో మహిళా మార్టులు

డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు మహిళా మార్టులు విజయవంతంగా నడుస్తూ లాభాలను ఆర్జిస్తున్నాయని తెలిపారు. చేతివృత్తులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, పసుపు ప్రాసెసింగ్ యూనిట్ విజయవంతంగా కొనసాగుతుందన్నారు. జిల్లాలో 150 సంఘాలకు ప్రత్యేక రుణాలు అందించి చిన్న వ్యాపారవేత్తలుగా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పొరుగు రాష్ట్రాల్లో వ్యాపార కార్యక్రమాలపై సంఘ సభ్యులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.

జిల్లాలో 74 పాలశీతలీకరణ కేంద్రాలు

జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 74 పాలశీతలీకరణ కేంద్రాలు పనిచేస్తున్నాయని, వీటి ద్వారా 25 వేల కుటుంబాలు మంచి ఆదాయం గడిస్తున్నాయని తెలిపారు. రాయితీ కింద దాణామృతంతో పాటు జొన్న, మొక్కజొన్న విత్తనాలను సైతం అందిస్తున్నామన్నారు. దీనివల్ల పాల దిగుబడి పెరిగే అవకాశం ఉందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘం సభ్యులకు రాయితీపై చాఫ్ కట్టర్లు అందిస్తున్నామన్నారు. నాటుకోళ్లు, మేకలు, గొర్రెల పెంపకానికి కూడా రాయితీతో కూడిన రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఏపీడీ రవి, డీపీఎంలు వెంకటేష్, రవికుమార్, స్త్రీనిధి ఏజీయం వెంకటప్రకాష్, జిల్లా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష అద్భుత పథకం



ఆరోగ్య శిబిరంలో ప్రసంగిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన నుంచి ఆవిర్భవించిన అద్భుత పథకమే జగనన్న ఆరోగ్య సురక్ష అని పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు అందరినీ ఆలోచింప చేస్తాయని తెలిపారు. గురువారం పుత్తూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న ధృఢ సంకల్పంతో వైద్య రంగంలోనూ విప్లవాత్మక మార్పులను తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రజలకు సైతం ఆధునిక వైద్య సేవలందించేందుకు విలేజ్ క్లినిక్‌లను, రోగుల వద్దకే వైద్యం అందేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులు సైతం డాక్టర్లు కావాలన్న ధృఢ సంకల్పంతో నాలుగేళ్లలో రూ.8 వేల కోట్ల అంచనా వ్యయంతో 17 మెడికల్ కాలేజీలకు భూమి పూజ చేయగా, ఇప్పటికే ఐదింటిని ప్రారంభించినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో తానొక ఎమ్మెల్యేగా, మంత్రిగా భాగస్వామి అయినందుకు గర్వపడుతున్నట్లు తెలిపారు. మేనిఫెస్టోను ఒక భగవద్గీతగా భావించి 99 శాతం వాగ్దానాలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అదే టీడీపీ మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిందని పేర్కొన్నారు. అనంతరం వృద్ధులకు కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. వైద్యాధికారులు ఎస్.భువనేశ్వరి, సీ.సంగీత, తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామి, మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, వార్డు కౌన్సిలర్ రాజేశ్వరి, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణ పడి ఉంటాం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి

చిత్తూరు రూరల్: ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు గుర్తింపు ఇవ్వడం అభినందనీయమని, గుర్తింపు సంఘంగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి అసోసియేషన్ రుణ పడి ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు రమణరెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని అంబేడ్కర్ భవనంలో గురువారం ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈసందర్భంగా రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసి రెండున్నరేళ్లు పూర్తయిందన్నారు. ఆర్టీసీ ఆర్థిక నష్టాల్లో ఉన్నా ఉద్యోగుల జీతభత్యాల విషయంలో ఇబ్బందులు లేకుండా చూస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు వేలు, జిల్లా కార్యదర్శి జేవీ భాస్కర్, సభ్యులు నారాయణ, వినోద్‌కుమార్, ఎన్ హరిదాస్, జి శివకుమార్, హరిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



సంతాపం వ్యక్తం చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : మండలంలోని ములురు గ్రామంలో విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ అనంతరెడ్డి కోడలు సుభద్రమ్మ (45) గురువారం ఉదయం తాగునీటి బోరు స్టార్టర్ ఆన్ చేస్తుండగా షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ప్రమాదానికి కారణమైన స్థలాన్ని పరిశీలించారు. సుభద్రమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వం తరపున ఆదుకుంటామని తెలిపారు. ఇంకా సంతాపం తెలిపిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, సర్పంచ్ లోకేష్, పలువురు నాయకులు ఉన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడిఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెద్దపంజాణి: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బట్టందొడ్డి గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం.. బట్టందొడ్డి సమీపంలో చెట్టుకు శవం వేలాడుతుండగా గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని కిందకు దింపి, పోస్టుమార్టమ్‌కు పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి సుమారు 65 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, తెలుపు రంగు షర్టు, ఎరుపు రంగు డ్రాయర్‌తో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విధుల్లో అలసత్వానికి షోకాజ్ నోటీసులు

చిత్తూరు కలెక్టరేట్ : సర్కారు బడుల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం నాడు–నేడు పనులను ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. జిల్లా వ్యాప్తంగా రెండవ విడత నాడు–నేడు పనుల్లో అలసత్వం వహిస్తున్న హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నారు. కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు గురువారం 144 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా రెండవ దశలో నిర్వహిస్తున్న 1,179 పాఠశాలలకు రూ.156 కోట్ల రివాల్వింగ్ ఫండ్ ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటి వరకు రూ.147 కోట్ల కు గాను పనులు నిర్వహించి బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. మిగిలిన 9 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేయకుండా హెచ్‌ఎంలు అలసత్వం వహిస్తున్నారు. వీరికి నోటీసులు ఇవ్వనున్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

పలమనేరు: దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చిందని డీఈవో విజయేంద్రరావు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం జరిగిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నాడు–నేడు కింద బడులను తీర్చిదిద్దారు కాబట్టి గురువులుగా మనం కూడా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అధ్యక్షత వహించిన సంఘం జిల్లా గౌరవ సలహాదారు సోమచంద్రారెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా విద్యారంగంలో సంస్కరణలు వచ్చాయన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యువరాజ్‌రెడ్డి, జయకాంత్, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ వెల్ఫేర్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ అమరనాథ్, నాయకులు పుష్పావతి, ఏఆర్‌కుమార్, పట్టాభిరామయ్య, రోషల్ అలీఖాన్, రమేష్ గిరిధర్, వడయార్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని స్కూటరిస్టు దుర్మరణం





మృతి చెందిన మనోహర్, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న మృతుడి భార్య, బంధువులు

వెదురుకుప్పం: టిప్పర్ ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందడం వెదురుకుప్పం మండలంలో విషాదాన్ని నింపింది. మూడేళ్ల బిడ్డ తండ్రి కోల్పోయాడని.. కుటుంబానికి ఎవరు దిక్కంటూ భార్య గుండెలు బాదుకుని విలపించడం అక్కడివారిని కలిచి వేసింది. అతివేగంగా టిప్పర్ నడపడంతోనే ప్రమాదం జరిగిందని, తమకు న్యాయం చేయాలంటూ బంధువులు పోలీసు స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. స్థానికుల కథనం మేరకు.. శ్రీరంగరాజపురం మండలం రాఘవరాజపురానికి చెందిన టి.మనోహర్(30) తిరుపతిలో మేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య నందిని, మూడు నెలల కుమారుడు ఉన్నారు. గురువారం ఉదయం గ్రామం నుంచి టీవీఎస్ స్కూటర్‌లో మనోహర్(30)తో పాటు చిన్నాన్న చిన్నమోహన్ పని కోసం తిరుపతికి బయలుదేరారు. వాహనాన్ని చిన్న మోహన్ నడుపుతున్నారు. పచ్చికాపల్లం దాటిన అనంతరం ఎర్రగుంట సమీపంలోని రాజుబావి కనుమ వద్ద తిరుపతి నుంచి ఎదురుగా వస్తున్న బస్సును తప్పించి స్కూటర్‌ను ఎడమ వైపునకు తిప్పారు. ఈ సమయంలో స్కూటర్‌ను వెనక వైపు నుంచి అమిత వేగంతో డస్ట్‌లోడ్‌తో వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో మనోహర్ టిప్పర్ చక్రాల కింద పడి మృతి చెందాడు. చిన్న మోహన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్‌ను ఆపకుండా డ్రైవర్ నేరుగా రాయలచెరువు వైపు వెళ్లాడు. ప్రమాద వార్త తెలుసుకున్న అక్కడి గ్రామస్తులు టిప్పర్‌ను అడ్డుకున్నారు. సమాచారం అందిన వెంటనే వెదురుకుప్పం పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వివరాలను సేకరించారు. మృత దేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం రుయాకు తరలించారు.

న్యాయం చేయాలని నిరసన

టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం, వేగంతోనే ప్రమాదం జరిగిందని బంధువులతో కలిసి మృతుడు తండ్రి దొరస్వామి, భార్య నందిని వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం విలేకరులతో నందిని మాట్లాడుతూ న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే టిప్పర్ యజమానితో కలిసి కేసును నీరుగార్చేలా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేసింది. భర్త మృతితో నందిని కుటుంబం వీధిన పడిందని, పేద కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.